ఆరు గ్యారెంటీలకు ఎగనామం

- సమస్యలు గాలికొదిలిన కాంగ్రెస్
- కొంతాన్‌పల్లిలో కబ్జాదారుడి నుంచి భూములను దళితులకు ఇప్పిస్తాం
- మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

శివ్వంపేట: కొంతాన్ పల్లిలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

పాపన్నపేట: రామతీర్థంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

శివ్వంపేట, మే 1: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను తప్పుతోవ పట్టించి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ గ్యారెంటీలకు ఎగనామం పెట్టిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దంతాన్‌పల్లి, కొంతాన్‌పల్లి, గుండ్లపల్లి, మల్లుపల్లి, మగ్దుంపూర్, దొంతి, గంగాయిపల్లి, శభాశ్‌పల్లి, గౌతోజిగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే, పలువురు నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి చదువుకున్న వ్యక్తి, కలెక్టరైన వ్యక్తే ప్రజాప్రతినిధిగా మారి సమస్యల పరిష్కారానికి వస్తున్నారన్నారు. రూ.100 కోట్ల సొంతనిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేసే లక్ష్యాన్ని పెట్టుకున్నారని గుర్తుచేశారు. భారీ మెజార్టీ ఇచ్చి ఎంపీగా వెంకట్రామిరెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంతాన్‌పల్లిలో ఎస్సీల భూములు అక్రమంగా కబ్జా చేస్తే నిలదీసి వారికి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ చెబితేనే రాముడికి మొక్కుతున్నామా? దేవుళ్ల పేరిట మత రాజకీయం చేస్తున్న ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. ప్రచారంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నాయకుడు సింగాయపల్లి గోపి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, గొర్రె వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు లాయక్, గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్, కన్నారం దుర్గేశ్, పార్వతి సత్యం తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం

పాపన్నపేట, మే1: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గార్యెంటీల అమలులో విఫలమైందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామతీర్థం ముద్దాపూర్ గ్రామాల్లో కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యకర్తలతో ముచ్చటించి అప్పట్లో బీఆర్ఎస్ కాలంలో సంక్షేమ పథకాలు ఎలా అమలయ్యాయి, ఇప్పుడు ఎలా అమలు అవుతున్నాయో ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఆమె వెంట రామతీర్థం బీఆర్ఎస్ నాయకులు బాబాగౌడ్, ఆంటోని, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

కొంతాన్‌పల్లిలో భారీగా హాజరైన జనం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం


తూప్రాన్: ఇస్లాంపూర్‌లో ఉపాధి హామీ కూలీలతో..


నార్సింగి మండలం కేంద్రంలో ఎంపీపీ, జడ్పీటీసీ


చిన్నశంకరంపేటలో ఏకే గంగాధర్‌రావు

నిజాంపేటలో ఇంటింటా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

రామాయంపేట: కారుకే ఓటేస్తామని మహిళల ప్రతిజ్ఞ


తూప్రాన్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

మనోహరాబాద్: జీడిపల్లిలో ఇంటింటి ప్రచారం

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

బీఆర్ఎస్‌లో చేరుతున్న హన్మంతాపూర్ గ్రామస్తులు, నాయకులు

నర్సాపూర్, మే1: నర్సాపూర్ మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన హన్మంతాపూర్ గ్రామానికి చెందిన ప్రజలు, నాయకులు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లోంచి బీఆర్ఎస్‌లో చేరారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు ఉంటుందన్నారు.

బీఎన్ఆర్‌కేఎస్ అధ్యక్షుడిగా ఏశం వెంకటేశ్ యాదవ్

మాట్లాడుతున్న బీఎన్ఆర్‌కేఎస్ అధ్యక్షుడు ఏశం వెంకటేశ్ యాదవ్

మనోహరాబాద్, మే 1: మండలంలోని కాళ్లకల్‌లో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (బీఎన్ఆర్‌కేఎస్) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏశం వెంకటేశ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా కొత్త వెంకటేశ్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా శంకర్, సలహాదారుడిగా జొన్నోజి రామాచారీ, సభ్యులుగా శంకర్, నర్సింలు, పింకు, లక్ష్మణ్, గోపాల్, సైదులును ఎన్నుకున్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

తాటి చెట్టు పై నుంచి కింద పడి వృతి చెందిన రాములు, రోదిస్తున్న కుటుంబీకులు

చిలిపిచెడ్(కొల్చారం), మే 1: తాటి చెట్టు పై నుంచి కింద పడి ఒకరు మృతి చెందిన ఘటన కొల్చారం మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో బుధవారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం నాయిని జలాల్పూర్‌కు చెందిన కొప్పుల రాములు (60) తాటి ముంజల కోసం చెట్టు ఎక్కాడు. ముంజలను తీస్తుండగా జారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ లచ్చయ్య కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

పెద్ది మల్లేశం (ఫైల్)

చిలిపిచెడ్, మే 1: అతివేగంతో వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఏఎస్సై మిస్బోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం(44) పుల్కల్‌లో బంధువులు నిర్వహించిన బీరప్ప జాతరకు వెళ్లి టీఎస్ 35జీ 3670 బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న డీఎల్ 0345 నంబరు గల కారు డ్రైవర్ అతివేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై నుంచి పొలంలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆటోలో జోగిపేట దవాఖానకు ఏఎస్సై తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సంగారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మిస్బోద్దీన్ తెలిపారు.

వాటర్ మిలన్ జ్యూస్ తాగి ముగ్గురికి అస్వస్థత

బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రామాయంపేట పోలీసులు

రామాయంపేట, మే 1: రామాయంపేట బస్టాండులోని జ్యూస్ స్టాల్‌లో బుధవారం వాటర్ మిలన్ జ్యూస్ తాగి ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వ్యాపారులు కొవ్వూరి లక్ష్మణ్, యాద నాగరాజు, తోట గగన్ బస్టాండ్‌లో ఎప్పటిలాగే వాటర్ మిలన్ జ్యూస్ తాగారు. దీంతో వెంటనే వారికి వాంతులయ్యాయి. వెంటనే అక్కడే ఉన్న తోటి స్నేహితులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. రామాయంపేట ఏఎస్సై సాదత్ మియా ఘటనా స్థలికి చేరుకుని విచారించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మెదక్ అర్బన్, మే 1: ప్రజలు ఆశ, భయంతో సైబర్ నేరాలకు గురవుతున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం మెదక్ సీఐ దిలీప్ ఆధ్వర్యంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఎన్నో రకాలుగా ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతి జిల్లాలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గౌతోజిగూడెంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

మనోహరాబాద్, మే 1: గౌతోజిగూడెంలో సీఎంఆర్ఐటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ క్యాంపు బుధవారంతో ముగిసింది. చివరిరోజు విద్యార్థులు చెత్తబుట్టలు, అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్‌ను బహూకరించారు. మాజీ ఉప సర్పంచ్ పంచమి రేణుకుమార్ వారిని సత్కరించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ జంగారెడ్డి, ఆఫీసర్ నిఖిల, సతీశ్ పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ అర్బన్,మే1: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ బాల స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

మెదక్ అర్బన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఉన్నతాధికారులతో కలిసి హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ, వెబ్ కాస్టింగ్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈవీఎం యంత్రాలపై బ్యాలెట్ పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 3 నుంచి 6వ తేదీ వరకు మొదటి విడత, 8 నుంచి రెండో దశ హోం ఓటింగ్ పూర్తి చేయాలన్నారు. ఈనెల 13న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు.

సామాజిక భద్రతను విస్మరిస్తున్న బీజేపీ: డీబీఎఫ్

అసంఘటిత కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి శంకర్

రామాయంపేట, మే1: అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తున్నదని, ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. బుధవారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన కార్మికుల హక్కుల సాధనకు డీబీఎఫ్ పోరాటం, ప్రచారోద్యం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్, పాతూరి రాజు, కల్లూరి సంజీవ్, కల్వకుంట్ల చంద్రం, రాజు, సత్యం పాల్గొన్నారు.

అధికారంలోకి రాకుండా బీజేపీని అడ్డుకోవాలి

నిజాంపేట, మే1: రాజ్యాంగాన్ని రద్దు చేసేలా మాట్లాడుతున్న బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ అన్నారు. బుధవారం నిజాంపేటలో విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్, నిజాంపేట మాల మహానాడు అధ్యక్షులు యాదగిరి, చంద్రయ్య, జిల్లా కార్యదర్శి సంజీవ్, యూత్ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి

మాట్లాడుతున్న మదన్‌రెడ్డి

చిలిపిచెడ్, మే 1: మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు నర్సాపూర్ కాంగ్రెస్ క్యాంపు ఆఫీస్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో బుధవారం చేరారు. నాయకురాలు సుహాసిని, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, పాండరి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాసీన్, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, మల్లేశం, యాదయ్య పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద

మెదక్ అర్బన్, మే1: పని ప్రదేశాల్లో మహిళలు, పిల్లలకు రక్షణ కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అన్నారు. బుధవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సిద్ధయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ పాల్గొన్నారు.

కోలపల్లి చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం

నగదు పట్టుకున్నట్లు రసీదు ఇస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట, మే1: కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు బుధవారం నిర్వహించిన తనిఖీలో రూ. 1.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మహీంద్రా వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును గుర్తించారు. నగదును సీజ్ చేసి సంగారెడ్డి గ్రీవెన్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

రామాయంపేట, మే 1: వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని రామాయంపేట ఎస్సై రంజిత్ తెలిపారు. బుధవారం పట్టణ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనాలపై ఉన్న స్టిక్కర్లు తొలిగించారు. హెల్మెట్లు పెట్టుకోని వాహనదారులపై చలాన్లు వేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ కాపాడుతుందన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

బ్రాహ్మణపల్లిలో కాంగ్రెస్ ప్రచారం

నర్సాపూర్,మే1: బ్రాహ్మణపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ఎంపీపీ జ్యోతీసురేశ్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, నాయకులు శ్రీనివాస్ గుప్తా, లలితానర్సింగ్, సురభి, వినోద, విజయభాస్కర్, అశోక్‌గౌడ్, పాషా, నర్సింహులు

నేడు చిలిపిచెడ్‌లో ఎమ్మెల్యే ప్రచారం

చిలిపిచెడ్, మే 1: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాలరాజ్ తెలిపారు. ఈ ప్రచారం మండలంలోని రాందాస్‌గూడ, సోమక్కపేట, శీలాంపల్లి, ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం, జగ్గంపేట గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు.

విద్యుత్‌ఘాతంతో ఇల్లు దగ్ధం

వెల్దుర్తి, మే 1: విద్యుత్ ఘాతంతో మంటలు చెలరేగి పెంకుటింట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన మాసాయిపేటలో బుధవారం జరిగింది. ఏశం మల్లేశానికి చెందిన పెంకుటింట్లో బుధవారం విద్యుతాఘాతంతో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన ఇరుగుపొరుగు, చుట్టుపక్కల వారితో కలిసి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లోని బీరువా, అందులోని రూ.40 వేల నగదు, సామగ్రి కాలిపోయాయి.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



శివ్వంపేట, మే 1: శివ్వంపేట మండల శభాశ్‌పల్లి గ్రామంలో జాల మహేశ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్వతీ సత్యం, మాజీ వార్డ్ సభ్యుడు బాసంపల్లి పోచగౌడ్, వెంకటేశ్, ఇస్మాయిల్, రాజు, భాస్కర్, సత్యనారాయణ, చింతల మహేశ్, శేఖర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.